మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో భాగంగా మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన క్రిస్టియన్ మహిళలకు ఎమ్మెల్యే కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గానికి ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి పథకం ద్వారా 567 కుట్టు మిషన్లు మంజూరైనట్లు తెలిపారు. మరో 500 మిషన్లు అదనంగా మంజూరు చేయాలని కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహ్మ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, ఇన్‌చార్జి ఎంపీడీవో మహ్మద్ రహెమాన్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య పాల్గొన్నారు.



శంషాబాద్‌కు వెళ్లే దారిలో కురుస్తున్న వాన





కేశంపేటలో ఓ ఇంటిలోకి చేరిన వరద నీరు

శివార్లలో కుండపోత

గ్రామీణ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు

జలమయమైన లోతట్టు ప్రాంతాలు

- జనజీవనం అస్తవ్యస్తం
- మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో అత్యధికంగా 151.5మి.మీ వర్షపాతం
- రంగారెడ్డి జిల్లా కేశంపేటలో 91.3 మి.మీ
- అయినా పలు మండలాల్లో లోటు వర్షపాతమే
- ఉమ్మడి జిల్లాకు మరో నాలుగైదు రోజుల వర్షసూచన

నగర శివారు ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురిసింది. మేడ్చల్, రంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు మండలాల్లో సోమవారం సాయంత్రం ఏకధాటిగా రెండుగంటల పాటు భారీ వర్షం కురిసింది. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో రికార్డు స్థాయిలో 151.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే శివార్లలోని అనేక మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. రోడ్లన్నీ జలమయమైయ్యాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. డ్రైనేజీల్లో నీళ్లు పొంగడంతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరో వైపు గ్రామీణ ప్రాంతాల్లోనూ వర్షం కురవడంతో రైతులు సంతోష పడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): గత రెండు వారాలుగా ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న వర్షాలు పంటలకు ఊపిరి పోస్తున్నాయి. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న పంటలు వేసిన రైతులు ఊరట చెందుతున్నారు. మరో వైపు ఇప్పటి వరకు పంటలు వేయలేకపోయిన వారు విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే వరి నాట్లు వేసేందుకు కూడా రైతులు సిద్ధమవుతున్నారు. మరో నాలుగైదు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ పేర్కొవడంతో ఉమ్మడి జిల్లాలో సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే సోమవారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని రాజీవ్ గృహకల్పలో 102.0మి.మీ, బస్తీదవాఖాన పరిధిలో 100.8 మి.మీ, బాలానగర్ మండలం హైదర్‌నగర్‌లో 85మి.మీ, శంషీగూడలో 81.5మి.మీ, గాజులరామారం, ఆదర్శనగర్‌లో 75.8 మి.మీ, బాచుపల్లిలో 62.5మి.మీ, ఈఎస్ఐ, జీడిమెట్లలో 59.0మి.మీ, ఉప్పల్‌లో 43.0మి.మీ వర్షపాతం

మిగతా 7వ పేజీలో...

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్



బాధ్యతలు స్వీకరిస్తున్న కె.చంద్రారెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) కె.చంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు ఏవో సునీల్ కుమార్ స్వాగతం పలికారు. ఇక్కడ అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన భూపాల్ రెడ్డి ఏసీబీ కేసులో అరెస్టు కావడంతో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆమె మెటర్నిటీ సెలవులో వెళ్లడంతో ప్రభుత్వం హెచ్ఎండీఏ బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు ఓఎస్డీగా పని చేస్తున్న కె.చంద్రారెడ్డిని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా ఇటీవలే బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

రాష్ట్రంలో బీజేపీదే అధికారం

- హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- రాష్ట్ర బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్

యాచారం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేస్తామని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. సోమవారం మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యాచారం మండలం మొండిగౌరెల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కేంద్రం పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే దక్కుతున్నాయని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేసి పంచాయతీల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీలకు పాలకవర్గం లేక అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆర్.విజయ్‌నాయక్, నాయకులు తాండ్ర రవీందర్, మేకల యాదగిరిరెడ్డి, కె.మధుకర్‌రెడ్డి, కె.పురుషోత్తమ్, మాజీ సర్పంచ్ ఆర్.విజయ్‌కుమార్, పి.శాంతికుమార్, డీ.ఈశ్వర్, నాగరాజు, గోగికార్ రమేష్, ఏ.జగదీష్‌యాదవ్, వన్నవాడ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

యువత డీఈఈటీని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : యువత డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ)ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం డీఈఈటీను ప్రారంభించిందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేట్ సంస్థలలో నిరుద్యోగ యువతకు నిరంతర ఉపాధి కల్పించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా ఆధారితమైన డీఈఈటీ వెబ్‌సైట్‌ను గతేడాది డిసెంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించినట్లు చెప్పారు. నిరుద్యోగులు ఈ వెబ్‌సైట్‌లో ఉచితంగా రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవచ్చన్నారు. నిరుద్యోగ యువతకు వారి నైపుణ్యాలు, విద్యార్హతలు, నివాస ప్రాంతం ఆధారంగా ఉద్యోగ సమాచారం అందించబడుతుందని తెలిపారు. అలాగే వివిధ నైపుణ్య శిక్షణ సంస్థలు అందించే కోర్సుల సమాచారాన్ని కూడా అందిస్తుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్వో సంగీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరుతున్న దివ్యాంగుడు

అల్బెండజోల్ మాత్రలు వేయాలి

ఏడాది పిల్లల నుంచి 19 ఏళ్లలోపు వయసున్న వారికి తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను

మిగతా 8వ పేజీలో...



మట్టి రోడ్డుతో అవస్థలు 8

- శంకుస్థాపన చేసినా ప్రారంభంకాని బీటీ పనులు

సర్వేను పర్యవేక్షించిన డీసీపీ సునీతారెడ్డి



సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీసీపీ సునీతారెడ్డి

యాచారం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): యాచారం మండలం మేడిపల్లి గ్రామంలో గ్రీన్‌ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల సర్వే కొనసాగుతోంది. సర్వే తీరును ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పర్యవేక్షించారు. సోమవారం రెవెన్యూ, టీజీఐఐసీ సిబ్బంది 210 ఎకరాల భూములను సర్వే చేశారు. మరో 20రోజుల పాటు భూముల సర్వే కొనసాగుతుందని వారు తెలిపారు.

అప్పులు.. అవస్థలు!

పంచాయతీల్లో పేరుకుపోయిన బకాయిలు

- పెండింగ్‌లో రూ. 52.99 కోట్ల బిల్లులు
- వడ్డీలు కట్టలేక ఇబ్బందుల్లో మాజీ సర్పంచులు
- ఏడాదిన్నరగా బిల్లుల కోసం ఎదురుచూపులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



ఉమ్మడి జిల్లాలో మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన బకాయిలు

జిల్లా	రూ.కోట్లు
రంగారెడ్డి	25.89
వికారాబాద్	5.10
మేడ్చల్	22
మొత్తం	52.99

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పదవిలో ఉన్నప్పుడు గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో మాజీ సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. బిల్లులు పెండింగ్ ఉండటంతో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేస్తామని చెబుతున్నా ప్రభుత్వం పూర్తి స్థాయిలో చెల్లించకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీకాలం ముగిసి ఏడాదిన్నర దాటినా బిల్లులు రాకపోవడం దారుణమని వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,159 గ్రామ పంచాయతీలు ఉండగా, సుమారు రూ.52.99కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని తక్షణమే చెల్లించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు.

గ్రామాలను అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో కొందరు.. వారసత్వ రాజకీయాలతో మరికొందరు.. రాజకీయాలపై వ్యామోహంతో ఇంకొందరు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకున్నారు. సర్పంచ్‌లుగా ఉత్సాహంతో పోటీ చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా ప్రజలకిచ్చిన మాట కోసం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందుకోసం సొంత నిధులు వెచ్చించారు. అవీ సరిపోక అప్పులు చేసి పనులు పూర్తిచేశారు. 2024లో పదవీ కాలం ముగిసింది. అప్పటి వరకు సర్పంచ్‌లుగా ఉన్నవారిని తప్పించి గ్రామాలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అవి వచ్చేవరకు పదవీ కాలం పొడిగించాలని విజ్ఞప్తి చేసినా వినిపించుకోలేదు. ఇటు పదవీకాలం, అటు పల్లెల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు

మిగతా 8వ పేజీలో...

అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశాం



బీఆర్ఎస్ హయాంలో గుండమడుగు తండా అభివృద్ధి కోసం రూ.6 లక్షలు అప్పులు చేశాను. బంధువుల వద్ద రూ.3 వడ్డీకి డబ్బు తీసుకువచ్చాను. ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నాను. ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయిలను చెల్లించాలి.

- దశరథ్, మాజీ సర్పంచ్, గుడ్లమడుగు తండా

విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్/షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. సోమవారం విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ ఫరూఖ్‌అలీకి ప్రతిపాదనలు అందజేసినట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా మెటీరియల్ మంజూరుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని వెల్లడించారు. నియోజకవర్గంలోని వ్యవసాయ రంగానికి కావాల్సిన 79 ట్రాన్స్‌ఫార్మర్లు, 32,300 మీటర్ల కండక్టర్ వైర్, 74,021 మీటర్ల కేబుల్ వైర్, 798 విద్యుత్ స్తంభాలు రాబోతున్నాయని తెలిపారు. ఇప్పటికే షాద్‌నగర్, కొత్తూర్ మున్సిపాలిటీలలో నెలకొన్న విద్యుత్ సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామని తెలిపారు.

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించండి

భూ భారతి సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. షాద్‌నగర్ ఆర్డీఓ ఆఫీసులో సోమవారం భూ భారతి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. అలాగే విద్యార్థులకు కావాల్సిన సర్టిఫికెట్ల జారీలో జాప్యం చేయవద్దని ఆదేశించారు.

ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు

షాద్‌నగర్ మున్సిపాలిటీలోని ఇంటింటికీ



వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శంకర్

మిషన్ భగీరథ నీటి సరఫరా చేయడానికి శ్రమించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి ఆదేశించారు. షాద్‌నగర్ మున్సిపల్ ఆఫీసులో కమిషనర్ సునీత అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. నూతన కాలనీలలో విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలతో పాటు తాగునీటి సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

డ్రగ్స్‌రహిత సమాజం కోసం ప్రతీఒక్కరు నడుం బిగించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. యునైటెడ్ యూత్ కరేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏసీపీ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నార్కోటిక్ బ్యూరో అధికారులు సీతారాం, సైదులు, ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డాక్టర్ చందూలాల్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటున్న బీజేపీ

- సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య



మాట్లాడుతున్న పగడాల యాదయ్య

కడ్తాల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని కేంద్రం ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ఆరోపించారు. బీసీ బిల్లు ఆమోదంతోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కడ్తాలలోని ఎంబీఏ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం మంగళవారం ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 17వరకు జిల్లా వ్యాప్తంగా సభలు, సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, బైక్‌యాత్రల ద్వారా తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ఇంటింటికీ తెలియచేస్తామని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి యాదయ్య, కార్యవర్గ సభ్యుడు కందుకూరి జగన్, పిప్పళ్ల శివశంకర్, గుమ్మడి కురమయ్య, పెంటయ్య, రమేశ్, పోచయ్య పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

ఆమనగల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని శారీరకంగా వాడుకొని మోసగించిన ఆమనగల్లుకు చెందిన ఎనుముల వెంకటేశ్‌కు 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ షాద్‌నగర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పును ఇచ్చారని ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో ఆమనగల్లుకు చెందిన బాలికను పట్టణానికి చెందిన వెంకటేశ్(34) ప్రేమ పేరుతో సన్నిహితంగా మెదలి మోసగించాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. షాద్‌నగర్ పోక్సో కోర్టు విచారణ చేసింది. నిందితుడు నేరం చేశాడని రుజువు కావడంతో అతడికి 20ఏళ్ల జైలు శిక్ష విధించారని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ కేసు సాక్ష్యాలు ప్రవేశపెట్టడంలో అప్పటి సీఐ ఉపేందర్, ఏసీపీ కుషాల్కర్, ఎస్‌హెచ్‌వో వెంకటేశ్, కోర్టు కానిస్టేబుల్ యాదయ్య, పీసీ జగన్‌లు ముఖ్యపాత్ర పోషించారని ఎస్ఐ పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

కొత్తూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని సిద్ధాపూర్‌లో దాతల సహకారంతో రూ.20లక్షలతో నిర్మించిన ఇప్పలగడ్డ మైసమ్మ ఆలయంలో సోమవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. మూడు రోజులుగా పూజా, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సాయంత్రం గ్రామ మహిళలు బోనాలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, అంబటి ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ రాసుల జంగయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, పాషా, మల్లేష్, వెంకటయ్య, కుమార్, గోపాల్, నరేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం పెట్టలేదని..

- హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్, చార్జిమెమో
- ఎంఈవోకు షోకాజ్ నోటీస్ జారీ

పెద్దేముల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టలేదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి డీఈవో షోకాజ్ నోటీస్, చార్జిమెమో, ఎంఈవోకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తింసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 12మంది విద్యార్థులే ఉన్నారు. గతేడాది భోజనం వండిన మహిళ కేవలం 12మంది విద్యార్థులకు వంట చేస్తే తనకు గిట్టుబాటు కాదని మానుకుంది. ఈ సారి విద్యార్థులకు భోజనం వండిపెట్టేందుకు గ్రామంలో ఎవరూ ముందుకు రాలేదు. విషయం తెలిసిన కలెక్టర్ తింసాన్‌పల్లి పాఠశాలను సందర్శించాలని డీఈవోను ఆదేశించారు. ఈ నెల 2న డీఈవో రేణుకాదేవి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు భోజనం వడ్డించడం లేదని నిర్ధారించారు. అదేరోజు భోజనం వండేందుకు వంట ఏజెన్సీని నియమించి విద్యార్థులకు భోజనం పెట్టించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశానుసారం సోమవారం హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు, చార్జిమెమో, ఎంఈవోకు షోకాజ్‌నోటీస్ జారీ చేశారు. పిల్లలకు భోజనం ఎందుకు పెట్టించలేదని వివరణ కోరారు. కాగా జిల్లాలోని ఏ పాఠశాలలోనైనా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బాలాజీసింగ్



ఆమనగల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్ సోమవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్తున్న బాలాజీసింగ్ కుమారుడు ఠాకూర్‌ప్రణవ్‌గోపాల్ సింగ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆశీర్వదించి అభినందించారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ సరోజారెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని చవాన్ ఫంక్షన్ హాల్‌లో గత నెల 27నుంచి నెల 3 వరకు జరిగిన సీనియర్ ఖేలో ఇండియా ఉషా ఉమెన్స్ లీగ్ 2025 పోటీల్లో పీటర్స్ ఇంజినీరింగు కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఉషా అసోసియేషన్ అఫ్ ఇండియా, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పీటర్ కళాశాలకు చెందిన హరిణి(సిల్వర్), కె.రామేశ్వరి(సిల్వర్), బి.సాయివర్షిని(బ్రాంజ్), ఎస్.సౌజన్య(సిల్వర్), టి.మహేశ్వరి(సిల్వర్) మెడల్స్ సాధించారు. సోమవారం కళాశాల డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి,అధ్యాపకులు, తోటి విద్యార్థులు పతకాలు సాధించిన వారిని అభినందించారు.

డివిడెండ్‌ను మంజూరు చేయాలి


వినతి పత్రం అందజేస్తున్న నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మహిళలు

కీసర రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపల్ పరిధి మహిళా సంఘాల సభ్యులకు రావాల్సిన డివిడెండ్ ఫండ్‌ను మంజూరు చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. మున్సిపాలిటీకి చెందిన మహిళా సంఘాలను 2018 వరకు కీసరలోని స్నేహ సొసైటీలో కొనసాగించి మున్సిపల్ ఏరియాలోని బ్యాంకుల్లో లావాదేవీలు కొనసాగించామని చెప్పారు. 2018 వరకు మహిళా సొసైటీలో వచ్చిన లాభాలను సభ్యులకు ఇవ్వలేదన్నారు. లాభాల్లో డివిడెండ్‌ను వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, నరేష్, రవీందర్ రెడ్డి, జ్యోతిపాండే, కృష్ణవేణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సర్వేయర్లకు కొనసాగుతున్న శిక్షణ


ట్రైనీ సర్వేయర్లకు సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

కోట్‌పల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): భూ సర్వేయర్లకు శిక్షణ ఇస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. 50రోజులుగా వికారాబాద్‌లో సీనియర్ సర్వేయర్లతో ట్రైనింగ్ పొందిన వారు సోమవారం నుంచి మండల సర్వేయర్లతో 40రోజులు శిక్షణ పొందుతారని తెలిపారు. మొత్తం 11 మందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎండీ.యూనుస్, ఆర్ఐ భాగ్యలక్ష్మి, సర్వేయర్ సాయికిరణ్, సిబ్బంది జగదీష్, బాల్‌రాజ్, ట్రైనీలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం



చేవెళ్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధికి సాయం అందించడం సంతోషంగా ఉందని ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం తన జన్మదినాన్ని పురస్కరించుకొని దేవరంపల్లిలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి రూ.2,01,000, అలాగే తంగడ్‌పల్లిలోని అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి రూ.51వేలు, న్యాలటలో సువార్త సంఘం భవన నిర్మాణానికి రూ.1.6లక్షల విరాళం అందజేశారు. గ్రామస్తులు, నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డిని అభినందించారు.

బీసీ రిజర్వేషన్లు ఆమోదించే వరకూ ఉద్యమం

వికారాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 42శాతం బీసీ రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం ఆమోదించే వరకూ ఉద్యమం ఆగదని కాంగ్రెస్ వికారాబాద్ నియోజకవర్గ బీసీ నాయకులు అన్నారు. సోమవారం ఢిల్లీకి బయల్దేరిన వారు మాట్లాడుతూ.. ఢిల్లీలో 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలో తలపెట్టిన ధర్నాకు వెళ్తున్నట్లు తెలిపారు. ఢిల్లీ వెళ్లిన వారిలో శ్రీనివాస్, వెంకట్, ఎం.శ్రీనివాస్, గోవర్ధన్, శివయ్య, అజీమ్, వెంకటయ్యగౌడ్ ఉన్నారు.



మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

లక్ష మందికి వైద్య పరీక్షలు

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి వెల్లడి

ఆమనగల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గ ప్రజల సంపూర్ణారోగ్యమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష మందికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. మొబైల్ క్లినిక్‌ల ద్వారా వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఆమనగల్లులోని ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం వన్‌మెడి సంస్థతో కలిసి వైద్య శిబిరాల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇందుకు రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను రాఘవేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల, వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో 2028 వరకు కొనసాగే వైద్య శిబిరాలను ఈ నెల 6న ఆమనగల్లు మండలం మేడిగడ్డలో ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతీ వారం ఒక గ్రామంలో ఇంటింటికి తిరిగి వన్‌మెడి బస్సు ద్వారా ప్రజలకు గుండె, లివర్, కిడ్నీ, మధుమేహ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. ఇప్పటికే 426 మందికి కంటి ఆపరేషన్లు, 8,256 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. నిరుద్యోగులకు ఫౌండేషన్ ద్వారా నైపుణ్యశిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, ఫౌండేషన్ సభ్యులు మండ్లి రాములు, రచ్చ శ్రీరాములు, మల్లేశ్‌నాయక్, అభినవ్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, కొండల్, జైపాల్‌రెడ్డి, శివ, దళపతిగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పురుషోత్తంరావు

రాజ్యాధికారమే లక్ష్యం

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంరావు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారమే లక్ష్యంగా, కుల సంఘం ఎన్నికలతో మున్నూరు కాపుల ప్రతిష్ఠ పెరిగిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంరావు అన్నారు. సోమవారం మండలంలోని బుక్క వేణుగోపాల్ ఫామ్‌హౌస్‌లో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపులు హక్కుల సాధనకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపు సంఘానికి ఎన్నికలు నిర్వహించడం అద్భుతన్నారు. ఇటీవల వేములవాడలో 400 కార్లతో ర్యాలీ నిర్వహించి ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించడంతో మున్నూరు కాపుల ప్రతిష్ఠ పెరిగిందన్నారు. అపెక్స్ కమిటీ సభ్యుడు మీసాల చంద్రయ్య మాట్లాడుతూ.. మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రం పేరుతో 'ఒకే కులం-ఒకే సంఘం'గా ఉండాలని కొండ దేవయ్యను అధ్యక్షుడిగా నియమిస్తే ఆయన ఒంటెద్దు పోకడలతో విసిగి పోయామన్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలు బండి పద్మ మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు దూరప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు హాస్టల్ వసతిని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అపెక్స్ కమిటీ సభ్యులు రౌతు కనకయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంటయ్య, కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నాటేందుకు 50వేల మొక్కలు సిద్ధం



నర్సరీని పరిశీలిస్తున్న కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వనమహోత్సవంలో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీలో ఇంటింటికీ పంపిణీ చేయడానికి 50వేల మొక్కలు సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ అన్నారు. హరిత ఆమనగల్లు లక్ష్యంగా ప్రతి ఇంటికి ఆరు మొక్కలు ఈ నెల 7 నుంచి పంపిణీ చేస్తామన్నారు. సోమవారం పట్టణంలోని నర్సరీని పరిశీలించారు. పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.

శివార్లలో కుండపోత

(ఐదో పేజీ తరువాయి)

నమోదైంది. కాప్రాలో 42.0మి.మీ, షాపూర్ నగర్‌లో 38.0మి.మీ, కాప్రా జీహెచ్ఎంసీ ఆఫీస్ వద్ద 35.8మి.మీ, వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా కేశంపేటలో అత్యధికంగా 91.3మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లో 79.5మి.మీ, శాస్త్రీపురంలో 65.8మి.మీ, ఆమనగల్లులో 57.3మి.మీ, మైలార్‌దేవ్‌పల్లిలో 42.3మి.మీ, మొయినాబాద్ మండలం చిలుకూరు మృగవనిలో 34మి.మీ వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాపోల్‌లో 44.3మి.మీ, దౌల్తాబాద్‌లో 29.0 మిల్లిమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

అయినా లోటు వర్షపాతమే

గడిచిన రెండు వారాలుగా ఉమ్మడి జిల్లాలో వర్షాలు కురుస్తున్నప్పటికీ పలు మండలాల్లో ఇంకా లోటు వర్షపాతమే ఉంది. ఈ సీజన్‌లో రంగారెడ్డి జిల్లాలో సగటు కంటే 14శాతం అధికంగా వర్షపాతం నమోదు కాగా వికారాబాద్ జిల్లాలో రెండు శాతం అధిక వర్షపాతం కురిసింది. మేడ్చల్ జిల్లా పరిధిలో పలు చోట్ల సోమవారం భారీ వర్షాలు కురిసినప్పటికీ ఇంకా 21 శాతం లోటు ఉంది. అనేక మండలాల్లో ఇప్పటికే అంతంత మాత్రంగానే వర్షాలు పడ్డాయి. రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ మండలంలో 53శాతం లోటు వర్షపాతం నమోదైంది. అలాగే మాడ్గుల మండలంలో 51 శాతం, ఫరూఖ్‌నగర్‌లో 38శాతం, చేవెళ్లలో 35 శాతం, తలకొండపల్లిలో 34 శాతం, యాచారంలో 33 శాతం, గండిపేటలో 32 శాతం, మంచాలలో 31 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా మర్పల్లి, దోమ, బంట్వారం మండలాల్లో 40శాతం, దౌల్తాబాద్‌లో 34శాతం తక్కువ వర్షం కురిసింది. మేడ్చల్ జిల్లాలోని మేడిపల్లి మండలంలో 43శాతం, దుండిగల్‌లో 37 శాతం, బాలానగర్, ఘట్‌కేసర్‌లలో 33శాతం చొప్పున తక్కువ వర్షపాతం నమోదైంది.

వివిధ చోట్ల వర్షం

శంషాబాద్/యాచారం/ఇబ్రహీంపట్నం/కేశంపేట: సోమవారం పలు చోట్ల వర్షం కురిసింది. శంషాబాద్‌లోని వివిధ బస్తీల్లో సాయంత్రం వర్షం కురిసింది. బస్తీల్లోని లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. కామిని చెరువులోకి నీరు చేరి నిండుకుండలా మారింది. యాచారం మండలం చౌదర్‌పల్లి, చిన్నతూండ్ల, అయ్యవారిగూడ గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. పత్తి, మొక్కజొన్న, కంది, టమాట చేలకు మేలు కలిగిందని రైతులు చెబుతున్నారు. ముందు వేసిన పత్తిపంట పూతకు వచ్చింది. ఇబ్రహీంపట్నంలో సోమవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో వాతావరణం చల్లబడింది. రోడ్లు జలమయమయ్యాయి. ఈ మధ్య కురిసిన వర్షాలతో భూగర్భ జలమట్టాలు కొంతమేర పెరిగాయి. కేశంపేట మండలంలో వర్షం దంచికొట్టింది. కేశంపేట, పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, తొమ్మిదిరేకుల, లింగంధన, నిర్దవెల్లి, లేమామిడి, సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, బైర్కాన్‌పల్లి, అల్వాల, కొత్తపేట, సంతాపూర్, వేములనర్వ, చింతకుంటపల్లి, కాకునూర్, బొదునంపల్లి, కొనాయపల్లి గ్రామాల్లో వర్షం కురిసింది. కేశంపేట సీఐ నరహరి వర్షం కురిసిన ప్రాంతాలకు పర్యవేక్షించారు.



అల్వాల బ్రిడ్జిపై నుంచి పారుతున్న వరద



కేశంపేటలో కురుస్తున్న వర్షం



శంషాబాద్ మధురానగర్ బస్తీలో కురుస్తున్న వర్షం

మహాధర్నాకు బీసీలంతా తరలాలి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ

ఆమనగల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ డిమాండ్ చేశారు. ఆమనగల్లు మార్కెట్‌యార్డ్‌లో సోమవారం మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు జగన్, మానయ్య, మండ్లి రాములుతో కలిసి మాట్లాడారు. బీసీ బిల్లు ఆమోదం కోసం ఈ నెల 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే మహాధర్నాకు బీసీలంతా కదిలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ యువజన తాలూకా అధ్యక్షుడు దళపతిగౌడ్, నాయకులు వస్పుల శ్రీశైలం, వస్పుల శ్రీకాంత్, కృష్ణానాయక్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఖాదర్‌ఖాద్రి, వెంకట్‌రెడ్డి, పర్వతాలు, విజయ్, మల్లేశ్‌నాయక్, ఫరీద్, నాజర్, అలీం, శ్రీను పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు కోసం కదంతొక్కిన బీజేపీ

- కడ్తాలలో భారీ నిరసన ర్యాలీ
- పాల్గొన్న మాజీ ఎంపీ రాములు, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి



నిరసన ర్యాలీలో మాజీ ఎంపీ రాములు, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి, పింఛన్‌దారులు

కడ్తాల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్ల పెంపు, కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీల అమలుకై పింఛన్‌దారులతో కలిసి బీజేపీ నాయకులు కదంతొక్కారు. నిరసన ర్యాలీ చేపట్టారు. బీజేపీ కడ్తాల్ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పింఛన్‌దారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ పోతుగంటి రాములు, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరయ్యారు. చెన్నకేశవ ఆలయం నుంచి తహసీల్దార్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వినతిపత్రాన్ని తహసీల్దార్ ముంతాజ్‌కు అందజేశారు. ధర్నాలో రాములు, ఆచారి మాట్లాడుతూ.. గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను వంచిస్తోందని మండిపడ్డారు. ఓట్ల కోసం దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు, ఇతర అన్ని రకాల సామాజిక పింఛన్లను రూ.4వేలకు పెంచుతానని చెప్పి ఎన్నికల్లో ఓట్లేయించుకొని 20నెలలైతున్నా అమలుచేయకపోవడం మోసగించడమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.20వేల కోట్ల పింఛన్ సొమ్మును పక్కదారి పట్టించిందని ఆరోపించారు. ప్రతీ పేద మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, మాజీ ఎంపీపీ వీరయ్య, గిరిజనమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, జిల్లా, మండల నాయకులు రాందాస్‌నాయక్, రెడ్యానాయక్, శ్రీశైలం గౌడ్, శంకర్, గోరటి నర్సింహ, భగీరథ్, రవీందర్‌రెడ్డి, బక్కి కుమార్, యాదగిరి, మన్య, వెంకటేశ్, నరేశ్‌గౌడ్, విక్రమ్, రాములు, సాయిలుగౌడ్, ప్రేమ్, పవన్‌రెడ్డి, సందీప్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


కోర్టుకెళ్లారని నోటీసులు!

- బల్దియా అధికారుల కన్నెర్ర
- 16ఏళ్ల కింద నిర్మాణానికి షోకాజ్ జారీ

తాండూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ లెక్చరర్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ విజయదేవి తన ప్లాటు నుంచి మురుగునీటి కాల్వను తవ్వారని హైకోర్టును ఆశ్రయించడంతో తాండూరు బల్దియా అధికారులు కన్నెర్రజేశారు. అదే స్థలంలో అన్ని అనుమతులతో 16ఏళ్ల క్రితం నిర్మించిన సింధూ డిగ్రీ కళాశాల భవనం అక్రమ నిర్మాణమంటూ తాజాగా నోటీసు జారీ చేశారు. ఇప్పటి వరకు సదరు భవనానికి ఆస్తిపన్ను తీసుకుంటున్నారు. తమపైనే కోర్టుకు వెళ్లారనే అక్కసుతో మున్సిపల్ అధికారులు నోటీసులిచ్చారని, అక్రమ నిర్మాణమంటూ పేర్కొనడం చర్చనీయాంశమైంది. అధికారులు మాత్రం ఈ నెల 2న కమిషనర్ సంతకంతో కూడిన నోటీసులో సర్వే నంబరు 139, 140లలో భవన నిర్మాణం అక్రమం అని, మున్సిపల్ యాక్టు 2019 ప్రకారం చర్యలుంటాయని పేర్కొన్నారు. అయితే ఈ భవనాన్ని 2019 మున్సిపల్ యాక్టు రాక ముందే నిర్మించింది. టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులిచ్చారు. ఈ భవనంపై ఎలాంటి ఫిర్యాదులు లేకున్నా 16ఏళ్ల క్రితం కట్టిన నిర్మాణం అక్రమం తాజా నోటీసులో పేర్కొన్నారు. ఏడు రోజుల్లో భవనానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు సమర్పించాలని సెక్షన్ 178 ప్రకారం షోకాజ్ నోటీసును జారీ చేశారు. ముందస్తు వివరాలు కోరకుండానే కమిషనర్ నోటీసు ఇవ్వడం సరికాదని, వేధింపుల్లో భాగంగానే నోటీసిచ్చారని విజయదేవి ఆరోపిస్తున్నారు.



16ఏళ్ల క్రితం నిర్మించిన భవనం



OFFICE OF THE MUNICIPAL COUNCIL :: TANDUR MUNICIPALITY
VIKARABAD DISTRICT

SHOW CAUSE NOTICE ISSUED UNDER SECTION 178 TELANGANA MUNICIPALITIES ACT 2019

P.O.No.: 11 /UC/TP/TAND/2025. Date : 02/08/2025.

Sub: - Tandur Municipality - Town Planning Section - un authorisedly constructed a building consisting of Cellar + 2 Upper Floors in Sy No. 139 & 140, Patha Kunta, Tandur Village, Vikarabad Dist - Show Cause Notice Issued - Regarding

<<<<>>>>

With reference to the subject cited above, it has come to the notice of the undersigned that Smt. S. Vijaya Devi, W/o V. Ranga Rao, has constructed a building consisting of Cellar + 2 Upper Floors and running a school in the name and style of Sindhu Degree College in Plot Nos. 41, 42, 51 & 52 situated in Survey Nos. 139 & 140, Pathakunta, Tandur Village, Vikarabad District which is violation of municipal act 2019 and building bye laws.

Details of construction.

You are unauthorisedly constructed building consisting of Cellar + 2 Upper Floors and doing business in the name and style of Sindhu Degree College at Tandur Village, Vikarabad District Dist.

Therefore, you are hereby directed to submit the sanctioned building permission documents, ownership documents and other relevant documents within 7 days of receipt of this notice, for verification and taking further necessary action, failing which further action will be taken as the provisions of the Telangana Municipalities Act, 2019.

COMMISSIONER
TANDUR MUNICIPALITY

మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన నోటీసు

కేశవగూడలో ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

- తొలగిన రైతుల ఇబ్బందులు

షాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవగూడలో వారం రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక పంటలు, వరినారు, దుక్కులు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో సోమవారం అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. రైతుల సమస్యపై.. 'ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. ఎండుతున్న' పైర్లు శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వారం రోజులుగా పంటలు ఎండుతున్నాయని అధికారులకు చెప్పినా విన్పించుకోలేదని, దీంతో తమ గోడును ఆంధ్రజ్యోతితో వెల్లబోసుకున్నామని రైతులు తెలిపారు. ఎట్టకేలకు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను బింగించారన్నారు. తమ సమస్య పరిష్కారానికి కృషిచేసిన ఆంధ్రజ్యోతికి ఈ సందర్భంగా కేశవగూడ రైతులు ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

సహకార వ్యవస్థ బలోపేతం

ఒకే గొడుగు కిందికి వివిధ సొసైటీలు

- పాత పద్ధతిలో సంఘాల నిర్వహణ
- కొత్త బ్రాంచీల ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్ర కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ వద్ద పెండింగ్



నవాంద్గి సొసైటీ కార్యాలయం

తాండూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, ఇతర సహకార రంగాల సంఘాల సభ్యులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సహకార వ్యవస్థలో మార్పులు చేపట్టనుంది. ప్రస్తుతం వేర్వేరుగా ఉన్న వివిధ సహకార సంఘాలను ఒకే సహకార వ్యవస్థలోకి తేవాలని భావిస్తోంది. పాత పద్ధతిలోనే సహకార సంఘ సభ్యులకు, రైతులకు సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, పశుసంవర్థకశాఖ సొసైటీలు, చేపల పెంపకదారుల సంఘాలు వంటివన్నీ ప్రస్తుతం వేర్వేరు కార్యనిర్వాహక వ్యవస్థతో పనిచేస్తున్నాయి. వీటన్నింటినీ ఒకే గొడుగు కిందికి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామం యూనిట్‌గా సంఘాలన్నింటినీ ఒకే సహకార వ్యవస్థలోకి తేనున్నారు.

అదనంగా బ్రాంచీలకు ప్రతిపాదనలు

తాండూరు నియోజకవర్గంలో బషీరాబాద్ మండలం కాశీంపూర్, పెద్దేముల్ మండలం మంబాపూర్, యాలాల మండలం లక్ష్మీనారాయపూర్‌లలో కొత్తగా సొసైటీ బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తారు. ఆర్థిక పరిస్థితి, సభ్యుల సంఖ్య, కార్యాలయాలు వంటి వాటిని పరిగణలోకి తీసుకొని బ్రాంచీలను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే దీనికి సంబంధించి డీపీఆర్(డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు)లను తయారు చేసి జిల్లా సహకార అధికారికి పంపగా కొత్త బ్రాంచీలను ఆమోదించారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉండే జాయింట్ వర్కింగ్ కమిటీ ఆమోదించి ప్రతిపాదనలను రాష్ట్ర కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్‌కు పంపారు. ఈ ప్రతిపాదన అక్కడ పెండింగ్‌లో ఉంది.

మరింత మెరుగ్గా సేవలు



ఉమ్మడి రంగారెడ్డి డీసీసీబీ పరిధిలో కొత్తగా బ్రాంచ్‌ల ఏర్పాటుతో వివిధ సొసైటీల సభ్యులకు మెరుగైన సేవలందించే వీలుంటుంది. కొత్తగా తొమ్మిది సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదించాం. వికారాబాద్ జిల్లాలో మంబాపూర్, కాశీంపూర్, లక్ష్మీనారాయణపూర్, అంగడి చిట్టెంపల్లి, రంగారెడ్డి జిల్లాలో హైతాబాద్, కందుకూర్, మంచాల, యాచారం, మేడ్చల్ జిల్లాలో శామీర్‌పేటల్లో సొసైటీ బ్రాంచ్‌లకు ప్రతిపాదించాం. అనుమతులు రావాల్సి ఉంది. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య సహకారంతో కొత్త బ్రాంచీలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర అధికారుల నుంచి అనుమతులొచ్చిన వెంటనే బ్రాంచీలను ప్రారంభిస్తాం.

- సంగెం రవీందర్‌గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్

ప్రతీ ఫిర్యాదును పరిష్కరిస్తాం

కులకచర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ప్రతీ ఫిర్యాదును పరిష్కరిస్తామని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధించిన శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ



అవగాహన కల్పిస్తున్న ఎస్బీఐ మేనేజర్ మాధవరావు

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

దోమ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): డిజిటల్ సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దోమ మండల ఎస్బీఐ మేనేజర్ మాదవరావు అన్నారు. దిర్సంపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన జన సురక్ష పరిపూర్ణ ప్రచార శిబిరంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్బీఐ ఖాతా కలిగిన 18 నుంచి 70 సంవత్సరాల్లోపు కలిగిన ప్రతీ ఒక్కరూ ప్రమాద బీమా చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు, వినియోగదారుల సేవా కేంద్రం సీఎస్‌పీ షాహీన్ బేగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికులకు బిల్లులు చెల్లించాలి

కందుకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు వెంటనే బిల్లులు చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ కోరారు. ఈ నెల 6న భోజన కార్మికులు వంట బంద్ చేసి నిరసన తెలుపనున్నందున సోమవారం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి కార్మికులు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెలలైనా భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఎనిమిది నెలల కోడిగుడ్ల బిల్లులు, మూడు నెలల కూరగాయిల బిల్లులు, మూడు నెలలు వేతనాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో కార్మికులు ప్రభావతి, శ్రీనివాస్, అశ్విని, అలివేలు, మంగమ్మ, లావణ్య, సుగుణ పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్, మహిళలు


విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్, సీఐ గంగాధర్, ఎస్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోట్ల కృష్ణమ్మకు సంతాపం

ఆమనగల్లు: సీనియర్ పాత్రికేయుడు కోట్ల వెంకటేశ్ మాతృమూర్తి కోట్ల కృష్ణమ్మ మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. సోమవారం తెల్లవారుజామున కృష్ణమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీకేశవులు, మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య నివాళులర్పించి సంతాపం సంతాపం తెలిపారు. నాయకులు యాట నర్సింహ, లక్ష్మణ్, జగన్, మానయ్య, కృష్ణనాయక్, దుర్గయ్య, చంటి, జంగయ్య, గోరటి నర్సింహ, విజయ్‌కృష్ణ, రఘు, యాదగిరి ఉన్నారు.

మట్టి రోడ్డుతో అవస్థలు

ఐదు నెలల క్రితం బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఇప్పటికీ పనులు ప్రారంభంకాని వైనం

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


వర్షం పడ్డప్పుడు బురదమయంగా మారుతున్న మక్తమాదారం - నేదునూరు రోడ్డు

కడ్తాల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మక్తమాదారం - నేదునూరు బీటీ రోడ్డు నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైంది. నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడం విమర్శలకు తావిస్తోంది. అసలే అంతంతమాత్రంగా ఉన్న రోడ్డు వర్షాలకు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2.8 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే ఐదు నెలల క్రితం శంకుస్థాపన చేశారు. మూడురోజులపాటు రోడ్డుకు ఇరువైపు గోతులు తీసి మట్టిని రోడ్డుపై పోశారు. ఆ తర్వాత పనులు నిలిపివేశారు.

అదుపు తప్పుతున్న వాహనాలు

వర్షం వచ్చిందంటే మట్టి రోడ్డు బురదమయంగా మారుతోంది. దీంతో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. రోడ్డు బాగా లేకపోవడతో ఆర్టీసీ బస్సులను సైతం రద్దు చేశారు. వర్షాలకు రోడ్డుపై పలు చోట్ల బురదమయంగా మారింది. పలు గ్రామాలను కలిపే ఈ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించకపోతే ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు.

పనులు ప్రారంభించాలి



మక్తమాదారం - నేదునూరు బీటీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలి. వర్షాలకు రోడ్డు పూర్తిగా పాడై ఇబ్బందులు పడుతున్నాం. ఐదు నెలల క్రితం బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అయినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు.

- నింగ్యారి యాదగిరి, మక్తమాదారం

క్రైం కార్నర్

యువకుడి అదృశ్యం


వసంత్‌కుమార్

శంకర్‌పల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇంట్లో నుంచి వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని హనుమాన్‌నగర్‌కు చెందిన యువకుడు వసంత్‌కుమార్(18) జూలై 29న ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లాడు. బంధువులు, తెలిసిన వారి వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు ఆవు మృతి

కొందుర్గు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శ్రీరంగాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. రైతు మేడిపల్లి నర్సింహులుకు చెందిన ఆవు పొలం వద్ద అనుమానాస్పదంగా మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని రైతు తెలిపాడు. జీవనాధారంగా ఉన్న ఆవు మృతి చెందడంతో పోషణ కష్టంగా మారిందని, దాతలు ఆదుకోవాలని వేడుకున్నాడు.


గణేశ్ ఉత్సవ కమిటీని సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దైవ కార్యక్రమాలు సమాజ శాంతి స్థాపనకు దోహదపడతాయని పేర్కొన్నారు. కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో సోమవారం గణేశ్ నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ తులసిరామ్ సమక్షంలో ఉత్సవాల నిర్వాహణ కోసం నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సభావత్ వినోద్‌నాయక్, వైస్ చైర్మన్‌గా జరుపుల నరేశ్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా సభావత్ రామునాయక్, కార్యదర్శిగా విస్లావత్ సుధీర్ నాయక్, కోశాధికారిగా కేతావత్ తులసీరామ్ నాయక్‌తో పాటు 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగురి వెంకటేశ్, నాయకులు జవహర్ లాల్ నాయక్, మాజీ చైర్మన్ హీరాసింగ్ నాయక్, భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దుద్యానాయక్, తులసి రామ్, యాదగిరి, రాము, కొర్ర శ్రీను, రమేశ్, భోని శంకర్, గోపి, అమర్‌సింగ్, చిన్న సుధీర్, చందు, అర్జున్, సాయికుమార్ పాల్గొన్నారు.

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

కందుకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన తెల్లరేషన్ కార్డులను మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం స్థాయిలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ గోపాల్ తెలిపారు. ఉదయం 11గంటలకు నియోజకవర్గ పరిధిలోని మల్లాపూర్‌లోని ఎలిమినేటి అమరేందర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో కందుకూరు, మహేశ్వరం, బాలాపురం మండలాలతో పాటు బడంగ్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాల రేషన్‌డీలర్లు, లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేడు వాహనాలకు వేలం

యాచారం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ శాఖ అధికారులు ఇటీవల దాడులు చేసి సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 5న మంగళవారం ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. బజాజ్ ఆటో రూ.లక్షా 50 వేలు, టీవీఎస్ ఎక్సల్ రూ.15వేలు, టీవీఎస్ ఎక్సల్ రూ.1500లకు వేలం వేస్తున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనేవారు ముందు రూ.5వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఎక్కువ పాడిన వారికి వాహనాలు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.

స్వీపర్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కొందుర్గు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలుసుమామిడిలోని కస్తుర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఒక స్వీపర్ పోస్టు ఖాళీగా ఉందని పాఠశాల ప్రత్యేకాధికారి షకీనానిస్సీ తెలిపారు. జీతం రూ.9,750 ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల మహిళలు పాఠశాల సమయంలో సంప్రదించాలని కోరారు.


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

ఎస్సీ బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి

చేవెళ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎస్సీ బాలికల కళాశాలకు అనుబంధంగా హాస్టల్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో బాలికల కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా నేటికీ ఎస్సీ బాలికల కోసం వసతి గృహం ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. ఈ విషయమై కలెక్టర్‌ను కలిసి వినతిప్రతం ఇస్తామని పేర్కొన్నారు. నాయకులు రాముల, పవన్‌కుమార్, రిషి ఉన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి


బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి

చేవెళ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు నిధులు జమకావడం హర్షనీయమని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత రెడ్డి అన్నారు. సోమవారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం పెట్టుబడికి రూ.6 వేలు అందించడం అభినందనీయమన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.11 కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో రూ.2.2 లక్షల కోట్లు జమ చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు.

వైద్యుడిని నియమించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి వైద్యుడిని నియమించాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్యులు లేక పేదలకు వైద్య సేవలు అందడం లేదని, దీంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేశ్‌నాయక్, నాయకులు బిక్కు నాయక్, సురేశ్ నాయక్, రఘురాములు, మల్లా రెడ్డి, రాజు ఉన్నారు. అలాగే కడ్తాల మండలం కొండ్రిగాని బోడు తండాకు చెందిన సభావట్ పీక్లికి మంజూరైన రూ.26 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేశారు.

సీపీఐ జిల్లా కార్యవర్గంలో ఇద్దరికి చోటు


జంగయ్యను సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గంలో చేవెళ్ల నుంచి ఇద్దరికి చోటు లభించింది. మొయినాబాద్ మండల కేంద్రంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా 17వ మహాసభలో ఇద్దరిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఇందులో చేవెళ్ల మం డలానికి చెందిన వడ్ల సత్యనారాయణచారికి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. అలా గే మల్గాని సుధాకర్‌గౌడ్‌కు జిల్లా కౌన్సిల్ స భ్యుడిగా నియమించారు. ఈ మేరకు సోమవా రం వారు మాట్లాడుతూ.. తమ ఎన్నికకు సహకరించిన సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామస్వామి, ప్రభులింగంకు ధన్యవాదాలు తెలిపారు.

శంషాబాద్: సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా మూడోసారి ఎన్నికైన పాలమాకుల జంగయ్యను ఆ పార్టీ నేతలు శంషాబాద్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ నేత పుస్తకాల నర్సింగ్‌రావు, పానుగంటి పర్వతాలు, నర్రా గిరి, ఆర్.యాదగిరి, నరసింహా రెడ్డి, నక్రూనాయక్, రాజు పాల్గొన్నారు.

యువత డీఈఈటీని సద్వినియోగం చేసుకోవాలి

(ఐదో పేజీ తరువాయి)

ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీవార్మింగ్ డే (జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం)పై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీలు, జూనియర్ కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు ఈనెల 11న అల్బెండజోల్ మాత్రలు వేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, డీఆర్వో సంగీత, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, డీపీవో సురేష్ మోహన్, డీఈఆవో సుశీంద్ర రావు పాల్గొన్నారు.

ప్రజావాణికి 82 ఫిర్యాదులు

ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. మొత్తం 82 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

వంట గదులను పరిశుభ్రంగా ఉంచాలి

వసతి గృహాలు, పాఠశాలల్లో వంటగదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తదితరులు పాల్గొన్నారు.

అప్పులు.. అవస్థలు!

(ఐదో పేజీ తరువాయి)

చేసిన బిల్లులు రాక తలలు పట్టుకుంటున్నారు. పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాలు నిధులిచ్చేవి. గ్రామాల్లో ఈ నిధులతోనే అభివృద్ధి పనులు చేపడతారు. ప్రతీ మూడు నెలలకోసారి ఈ నిధులు వచ్చేవి. దీంతో పనులు చేస్తే ఢోకా ఉండదనే నమ్మకంతో సర్పంచ్‌లు సొంత డబ్బులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటు, శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు, పైప్‌లైన్లు, డంపింగ్ యార్డుల నిర్మాణాలు, క్రీడా మైదానాలు, వాటర్ మోటర్ల ఏర్పాటు తదితర పనులు చేశారు.

అప్పులకు పెరుగుతున్న వడ్డీలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ఉందనగానే టార్గెట్లు పెడుతూ అభివృద్ధి పనులు చేయించింది. గ్రామాల్లో పనులు చేస్తే తమను గ్రామస్తులు జీవితాంతం గుర్తుంచుకుంటారనే తపనతో అప్పట్లో సర్పంచ్‌లు అధిక వడ్డీలకు అప్పులు చేసి మరీ పనులు చేపట్టారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారిపోవడం జరిగిపోయింది. ప్రభుత్వం మారిన కొద్ది నెలలకే సర్పంచ్‌ల పదవీకాలం కూడా ముగిసింది. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు రావాల్సిన బిల్లులకు నేటికీ మోక్షం లభించలేదు. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడం.. కొత్త పాలకవర్గాలు ఏర్పాటు కాకపోవడంతో కొత్త ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయడం లేదు. బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతోంది. మాజీ సర్పంచ్‌లు తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించేందుకు మళ్లీ అప్పులు చేస్తున్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఇబ్రహీంపట్నం సీడీపీవో వినితాదేవి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పల్లవి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, బాలమణి పాల్గొన్నారు.



టైమ్ టు టైమ్ అటెండెన్స్

ఎఫ్ఎస్ఏతో ఉపాధ్యాయుల పక్కా హాజరు

యాచారం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు నాలుగు రోజులుగా ఫేస్ రికగ్నిషన్ హాజరు వేసుకుంటున్నారు. ప్రభుత్వం ఈనెల 1 నుంచి ఈ విధానాన్ని అమలులోకి తెచ్చింది. టీజీఎఫ్ఆర్ఎస్ అనే యాప్ ద్వారా నేరుగా ఆన్‌లైన్‌లో హాజరు పడే విధంగా ఏర్పాట్లు చేయడంతో ఉదయం పాఠశాలలకు రాగానే పాఠశాల ఎదుట నిలబడి సెల్‌ఫోన్‌లో హాజరు వేసుకుంటున్నారు. సోమవారం మండలంలోని గున్‌గల్ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులు ఎఫ్ఎస్ఏ ద్వారా హాజరు నమోదు చేసుకున్నారిలా..


అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


యూజీడీ పనులు ప్రారంభం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కవేలిగూడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) పనులకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వీరాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. కొంత కాలంగా వెంకటపూర్ గేటు వద్ద వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను స్థినక నేతలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో కవేలిగూడ నుంచి వెంకటపూర్ వరకు డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.


వాగు వద్ద మాట్లాడుతున్న లక్ష్మీకాంత్ రెడ్డి

లాలాపేట వాగుపై బ్రిడ్జి నిర్మించాలి

కొందుర్గు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): లాలాపేట వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, వర్షాలు కురిస్తే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని లాలాపేట వద్ద ప్రవహిస్తున్న వాగును పరిశీలించి మాట్లాడారు. వాగులో నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని, ప్రజలు వాగు దాటడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు సమస్యను గుర్తించి బ్రిడ్జి నిర్మాణం చేపడితే లాలపేట్, చిన్న ఉమ్మెంత్యాల నుంచి కొందుర్గు మండల కేంద్రాకి వెళ్లడానికి మార్గం సులువు అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ చారి, వెంకట్ రెడ్డి, అంజిరెడ్డి, భూపాల్ రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దండు యాదవరెడ్డి

రైతుల సమస్యలు పరిష్కరించాలి

షాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి డిమాండ్ చేశారు. షాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం సంఘం నాయకులు, రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఏఈ కోటేశ్వర్‌రావును కోరారు. నాందార్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన మేకల మహేందర్ గేదె ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందితే నష్టపరిహారం కోసం ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని గ్రామ పంచాయితీ కార్యదర్శిని కోరగా మాకు సంబంధం లేదని, ఎంపీడీవో అపర్ణను అడగగా ఇది మాకు సంబంధించినది కాదని జవాబు చెబుతున్నారని ఆరోపించారు. ఏఈ కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు నారాయణరెడ్డి, సభ్యులు రాంచంద్రయ్యగౌడ్, నర్సింహారెడ్డి, కృష్ణ, ఒగ్గు మల్లయ్య, చెన్నయ్య రవి, చంద్రారెడ్డి, రైతులు గౌతం, సత్యంగౌడ్, సతీష్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు బూర్గుల భూ పంచాయితీ

షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలోని సర్వే నంబర్ 130లో ఉన్న భూమి పట్టాదారులు, గ్రామస్తుల మధ్య వివాదాలకు దారి తీసింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామం మధ్యలో సదరు సర్వే నంబరులో 1.30 ఎకరాల భూమి ఉంది. దీనిని దశాబ్దాల క్రితం దాత నర్సింగ్‌రావు గ్రామ అవసరాల కోసం దానం చేశారు. అందులో ఒక వర్గానికి చెందిన కుటుంబాలు సుమారు ఎకరం భూమిలో ఇళ్లు నిర్మించుకున్నారు. అలాగే గ్రామ అవసరాల కోసం నాలుగు బోర్లు వేశారు. ఇందులో నుంచే మురుగు కాల్వల నిర్మాణాలు ఉన్నాయి. ప్రస్తుతం 30 గుంటల భూమి ఉంది. ఆ భూమి చుట్టూ పట్టాదారు వారసురాలు అయిన విజయలక్ష్మి సదరు భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో గ్రామస్తులకు రాకపోకలు పూర్తిగా నిలిపోయాయి. గ్రామానికి చెందిన హరి అనే వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా నిర్మాణానికి అవసరమైన సామగ్రి తీసుకెళ్లేందు ఒకచోట ఫెన్సింగ్ తొలగించారు. సామగ్రి తీసుకెళ్లిన తర్వాత మళ్లీ ఫెన్సిగ్‌వేయడంతో వివాదం రాజుకుంది. ఫోన్లలో మాట్లాడుకున్న మాటలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మొదట విజయలక్ష్మి హరిపై ఫిర్యాదు చేయగా సోమవారం మూకుమ్మడిగా గ్రామస్తులు విజయలక్ష్మిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



దీక్షలో జేపీసీ నాయకులు, గ్రామస్తులు

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

తలకొండపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారం 275వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నేతలు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని మాజీ సర్పంచ్ జయమ్మావెంకటయ్య, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్ కోరారు. రాష్ట్రప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే 11 మండలాల జాబితాలో గట్టిప్పలపల్లిని చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు.

ముఖ గుర్తింపుతో పింఛన్ల పంపిణీ

చౌదరిగూడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పద్మారం గ్రామంలో ముఖగుర్తింపు ఆధారంగా లబ్ధిదారులకు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఫింఛన్ పంపిణీ చేశారు. గతంలో కంటే ఈ విధానం బాగుందని, ఫింఛన్‌దారుల నుంచి మంచి స్పందన వస్తున్నదన్నారు. గతంలో వేలిముద్రలతో ఇబ్బందులు ఎదురయ్యేవని, ఈ విధానంతో లబ్ధిదారుల ఇబ్బందలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీవో హన్మంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి షఫీ, గ్రామస్తులు ఉన్నారు.


కుట్టుమిషన్లు అందచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

లబ్ధిదారులకు కుట్టుమిషన్లు అందజేత

మాడ్గుల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఎంపీడీవో కార్యాలయంలో క్రిస్టియన్ మైనార్టీలకు మంజూరైన కుట్టు మిషన్లను సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృషితో ఇర్విన్ గ్రామ పంచాయతీలోని రెడ్డిపురమ్ గ్రామానికి చెందిన కాసు రాణి, తుమ్మ ఫౌలిన, తుమ్మ శృతిలకు కుట్టు మిషన్లు మంజూరయ్యాయి. వాటిని సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూదిని శ్రీనివాస్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్‌సీ డైరెక్టర్ జెల్ల రమేష్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌గౌడ్, తుమ్మ జ్యోతి పాల్గొన్నారు.